ప్రజాశక్తి
గురువారం 19 సెప్టెంబరు 2024
5
శ్రీకాకుళం

## ట్రిపుల్ ఐటి రిజిస్ట్రార్‌గా అమరేంద్ర కుమార్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి నూతన రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, క్యాంపస్-2, 3 ఇన్‌ఛార్జీలు సాగర్, సతీష్, ఫైనాన్స్ ఆఫీసర్ మోహనరావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రిపుల్ ఐటి అధికారులు

# మళ్లీ మొదటిదే...



ప్రభుత్వం ఆధ్వర్యాన నడుస్తున్న మద్యం దుకాణాలు మళ్లీ ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హయాంలో ఉన్న విధానాన్నే కూటమి ప్రభుత్వం అమలు చేయాలని నిర్ణయించింది. మద్యం రిటైల్ వ్యాపారాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తూ నూతన మద్యం విధానానికి కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపునకు సిద్ధమవుతోంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు నాలుగైదు రోజుల్లో రావచ్చని అధికారులు చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచే పాత పద్ధతిలోనే దుకాణాల కేటాయింపు ఉండవచ్చనే చర్చ కూటమి నాయకుల్లో జోరుగా సాగింది. ప్రభుత్వం ఇప్పుడు అదే నిర్ణయం తీసుకోవడంతో నాయకులు ఎగిరి గంతేస్తున్నారు. దుకాణాలు దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

- ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలకు కేబినెట్ ఆమోదం
- జిల్లాలో 193 దుకాణాలను నోటిఫై చేయనున్న ప్రభుత్వం
- లాటరీ పద్ధతిలో కేటాయింపు
- షాపులు దక్కించునేందుకు కూటమి నాయకుల ప్రయత్నాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మద్యం విషయంలో కూటమి ప్రభుత్వం 2014-19 మధ్య ఉన్న విధానాన్నే అమలు చేయాలని నిర్ణయించింది. బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం దీనికి ఆమోదం తెలిపింది. దీంతో జిల్లాలో ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యాన నడుస్తున్న దుకాణాలన్నీ ప్రయివేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. ఎక్సైజ్‌శాఖ అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం జిల్లాలో 193 దుకాణాలను నోటిఫై చేయనున్నారు.

గతంలో నిర్వహించిన ప్రభుత్వం అమ్మకాలు సాగించిన షాపులనే ప్రయివేట్ వ్యక్తులకు కేటాయించనున్నారు. మద్యం షాపుల కేటాయింపు కోసం త్వరలో దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. ఇతర రాష్ట్రాల వ్యక్తులకు భాగస్వామ్యం కల్పించేందుకు వారికి సైతం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. జిల్లాకు సంబంధించి ఒడిశా వ్యాపారులకు అవకాశం కల్పించినట్లయింది. వచ్చిన దరఖాస్తుల్లో నుంచి లాటరీ తీసి అనుమతులు మంజూరు చేయనున్నారు.

### సిద్ధమవుతున్న సిండికేట్లు

లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలపడంతో కూటమి నాయకులు వాటిని దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. సిండికేట్‌గా మారి దుకాణాలు పొందేందుకు యత్నిస్తున్నారు. ఒక్కో దుకాణానికి సుమారు రూ.30 లక్షలు పైన ఉంటుందనే ప్రచారంతో నిధుల సమీకరణకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. గ్రామాల్లో అంతేసి మొత్తాన్ని ఒకరిద్దరు సమకూర్చుకునే పరిస్థితి లేకపోవడంతో తమ అనుచరులు, కార్యకర్తల నుంచి డబ్బులు కూడబెడుతున్నారు. అంతా కలిసి దరఖాస్తులు చేసేందుకు సిద్ధమవుతున్నారు. సిండికేట్‌గా మారారన్న విషయం బయటపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఒకే దుకాణానికి వారిలో వారే నాలుగైదు దరఖాస్తులు పెట్టి లాటరీలో ఎవరికి దక్కినా అందరికీ భాగస్వామ్యం ఉండేలా స్కెచ్ వేస్తున్నారు. కొన్నిచోట్ల వైసిపి నాయకులతోనూ చర్చలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

### కూటమి నాయకులకు ఆర్థిక వనరులు

ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానం కూటమి నాయకులు, కార్యకర్తల ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం విధానం అటు ప్రభుత్వం, ఇటు కూటమి నాయకులు లాభపడేలా ఉందన్న చర్చ నడుస్తోంది. లాటరీ పద్ధతిన దుకాణాల కేటాయింపుతో ప్రభుత్వానికి ఒకేసారి రూ.వేల కోట్ల ఆదాయం సమకూరనుంది. మరోవైపు ఐదేళ్లుగా పైసా ఆదాయం లేకుండా ఉన్న కూటమి నాయకులకు ఆర్థిక వనరులనూ కల్పించనుంది. 2014-19 కాలంలో టిడిపి నాయకులు లాటరీ పద్ధతిన దుకాణాలు దక్కించుకుని భారీగా లాభపడ్డారు. దుకాణాలతో పాటు బెల్టు షాపులకు మందును సరఫరా చేసి బాగా కాసులు సంపాదించారు. ఇప్పుడు మళ్లీ అదే విధానం రావడంతో అంతా సంబరపడిపోతున్నారు. ఇప్పుడు వారితో పాటు కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన, బిజెపి నాయకులకూ భాగస్వామ్యం దక్కనుంది.

### వారి ఉద్యోగాలు పోయినట్టేనా..?

నూతన మద్యం విధానంతో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఇప్పటివరకు పనిచేస్తున్న ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యాన నడుస్తున్న దుకాణాల్లో జిల్లాలో 193 మంది సూపర్‌వైజర్లు, 556 మంది సేల్స్ మేనేజర్లు పనిచేస్తున్నారు. వీరిని గత ప్రభుత్వం అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించింది. సూపర్‌వైజర్లకు రూ.21,500, మేనేజర్లకు రూ.17,500 చొప్పున చెల్లిస్తున్నారు. మద్యం దుకాణాలు ప్రయివేట్ వ్యక్తులకు కేటాయించనుండడంతో వీరిని పనిలో నుంచి తొలగిస్తారన్న ప్రచారం సాగుతోంది. దుకాణాలు దక్కించుకున్న వారు తమకు కావాల్సిన వారిని నియమించుకునే అవకాశాలు ఉన్నాయనే చర్చ ఉద్యోగుల్లో నడుస్తోంది.

## అది అనధికార లేఅవుటే..

- పంచాయతీ, సుడా అనుమతుల్లేవు
- తోటవాడలో ప్లాట్ల కొనుగోలు చట్టరీత్యా నేరం
- హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన అధికారులు
- 'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

తోటవాడ లేఅవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బూర్జ మండలం తోటవాడలో వేసిన లేఅవుట్ అనధికారికమని పంచాయతీ అధికారులు స్పష్టం చేశారు. 'సుడా' అనుమతుల్లేకుండా తోటవాడ లేఅవుట్‌లో ప్లాట్లను విక్రయిస్తున్నారంటూ 'ప్రజాశక్తి' జిల్లా సంచికలో వరుసగా ప్రచురితమైన కథనాలపై జిల్లా ఇన్‌ఛార్జి పంచాయతీ అధికారి ఆర్.వెంకట్రామన్ స్పందించారు. లేఅవుట్ ప్రాంతంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని ఇఒపిఆర్‌డి విజయలక్ష్మిని బుధవారం ఆదేశించారు. దీనిపై స్పందించిన ఆమె సంబంధిత పంచాయతీ కార్యదర్శి సుధాకరరావుకు పలు సూచనలు జారీ చేశారు. దీంతో ఆయన సర్పంచ్ సూర ఆనందరావుతో కలిసి బోర్డు ఏర్పాటు చేశారు. తోటవాడలో వేసిన లేఅవుట్‌కు ఆ పంచాయతీ నుంచి గానీ సుడా నుంచి గానీ అనుమతుల్లేవని ఫ్లెక్సీలో పేర్కొన్నారు. అనధికారిక లేఅవుట్‌లో ప్లాట్ల అమ్మకాలు, కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. ఆ లేఅవుట్‌లో ప్లాట్లను కొనుగోలు చేస్తే ఇళ్ల నిర్మాణాలకు పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు మంజూరు చేయబోమని అందులో స్పష్టం చేశారు.

### పంచాయతీ కార్యదర్శి నిర్వాకం

సాధారణంగా రెవెన్యూ భూములో, దేవాదాయ భూములో ఆక్రమణలకు గురైనట్లు గుర్తించిన సందర్భంలో సాధారణంగా రోడ్డుకు ఆనుకుని హెచ్చరిక బోర్డులను ఉంచుతారు. నలుగురికి తెలిసేలా ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తారు. తోటవాడ పంచాయతీ కార్యదర్శి మాత్రం అందరూ ఫ్లెక్సీలను చూస్తే యజమానులకు ఇబ్బంది వస్తుందనుకున్నారో ఏమో గానీ లేఅవుట్ ప్రవేశం ద్వారం నుంచి అర కిలోమీటరు దూరంలో లోపల ఏర్పాటు చేశారు. లేఅవుట్‌లోకి వెళ్తే గానీ ఆ ఫ్లెక్సీ కనపడే పరిస్థితి లేదు. మరోవైపు తమకు త్వరలో సుడా అనుమతులు వస్తాయంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు తయారు చేసిన ఫ్లెక్సీ మాత్రం ప్రధాన ప్రవేశమార్గంలో ఉండడం గమనార్హం. పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కూడా ఎప్పుడు ఉంటుందో, ఎవరు పీకి పారేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. జిల్లా పంచాయతీ అధికారుల నుంచి వచ్చిన ఆదేశాలు పాటించామని చెప్పుకునేందుకే ఫ్లెక్సీ ఏర్పాటు చేశారా అన్న విధంగా వారి వ్యవహారశైలి ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిరసన తెలుపుతున్న పోస్టల్ ఉద్యోగులు

## లక్ష్యాల పేరిట వేధింపులు ఆపాలి

### పోస్టల్ ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఆచరణ సాధ్యం కాని లక్ష్యాలు, ఆన్‌లైన్ ట్రైనింగ్ కోర్సుల పేరుతో పోస్టల్ ఉద్యోగులను అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని, వీటిని ఆపాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్, ఆలిండియా జిడి ఎస్‌యు రాష్ట్ర సంఘాల సమన్వయ కమిటీ నాయకులు కె.గణపతి, ఎల్.బాబూరావు, వి.శశిభూషణరావు అన్నారు. ఇదే డిమాండ్‌పై డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. అనంతరం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి రాష్ట్ర సర్కిల్‌లో లక్ష్యాల పేరుతో అధికారుల వేధింపులు తారాస్థాయికి చేరుకున్నాయన్నారు. వేధింపుల వల్ల ఒత్తిడికి గురైన అనేకమంది ఉద్యోగులు అనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. డివిజనల్, సబ్ డివిజనల్ అధికారులు సైతం మరింత ఒత్తిడి పెంచేందుకు దూషణలు, దుర్భాషలాడడం, సెలవుల నిరాకరణతో వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. పోస్టాఫీసుల్లో సిబ్బంది సరిగా కూర్చొని పనిచేయడానికి కనీస వసతుల్లేవన్నారు. ట్రైనింగ్ కోర్సులు, లక్ష్యాలు ఇస్తున్న అధికారులు ఫారాలు, పాసు పుస్తకాలను సరఫరా చేయడం లేదని విమర్శించారు. కొన్ని నెలల కిందట ఖాతాలు తెరిచిన ఖాతాదారులకు పాసు పుస్తకాలు నేటికీ అందించలేదన్నారు. లక్ష్యాలను పూర్తి చేయడానికి యూనియన్లు వ్యతిరేకం కాదని, ఒత్తిడి పెంచి చేయమనడం సరికాదన్నారు. తీరు మారకపోతే ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజనల్ యూనియన్ నాయకులు యు.వి.రమణ, టి.వెంకటేశ్వర్లు, ఎన్.నందికేశ్వరరావు, బి.శ్రీరామ్మూర్తి నాయుడు, అప్పారావు, కృష్ణారావు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 28న ఐటిఐ నాలుగో విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఐటిఐల్లో మూడు విడతల్లో భర్తీ కాగా మిగులు సీట్లను ఈనెల 28వ తేదీన భర్తీ చేస్తున్నట్టు డిఎల్‌టిసి ఎడి వై.రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. సీట్లు పొందాలనుకునే వారు తమ దరఖాస్తులను iti.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సూచించారు. ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకున్న వారినే కౌన్సెలింగ్‌కు అనుమతించనున్నట్లు స్పష్టం చేశారు. 27న ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన, 28న కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

## పిఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం

### కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పిఎం సూర్యఘర్ పథకంపై విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టరేట్‌లో ఇపిడిసిఎల్ ఆధ్వర్యాన పిఎం సూర్యఘర్ పథకం పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన వనరుల వినియోగం వల్ల మేలు చేకూరుతుందన్నారు. సోలార్ విద్యుత్‌తో అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ పొందవచ్చన్నారు. ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే సోలార్ విద్యుత్‌ను వినియోగదారులు తమ అవసరాలకు వాడుకుని మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించుకోవచ్చన్నారు. బొగ్గు, జల విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వీలుందన్నారు. గ్రామాల్లో పెద్దఎత్తున ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవడం ద్వారా నిరంతరాయంగా విద్యుత్ అందుబాటులో ఉంచుకోవచ్చన్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ ఉద్యోగులు సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇపిడిసిఎల్ ఎస్ఇ కృష్ణమూర్తి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, ఇఇ బయ్యన్నాయుడు, ఎల్‌డిఎం సూర్యకిరణ్, డిఇఇ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల్లో సదుపాయాలకు నిధులు

**శ్రీకాకుళం అర్బన్ :** జిల్లాలో సొంత భవనాలున్న 533 అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, 526 కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినట్లు ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనులకు గానూ రూ.2.82 కోట్లను విడుదల చేసిందని, గ్రామీణ నీటిసరఫరా విభాగం ఖాతాలో ఈ నిధులు జమ చేసినట్లు పేర్కొన్నారు. నెల రోజుల్లో ఈ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించినట్లు తెలిపారు.

## రేపు వికలాంగుల గ్రీవెన్స్

**శ్రీకాకుళం అర్బన్ :** ఈనెల 20న ఉదయం పది గంటల నుంచి వికలాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ స్వాభిమాన్ కార్యక్రమం జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు వికలాంగుల శాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 'ఆశా'లపై పెరుగుతున్న దాడులు

- నిందితులపై చర్యలు తీసుకోవాలి
- ఆశావర్కర్స్ యూనియన్ ధర్నా

ప్రజాశక్తి - పలాస

ఆశా కార్యకర్తలపై దాడులు, రాజకీయ వేధింపులు పెరుగుతున్నాయని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, జిల్లా అధ్యక్షులు డి.ధనలక్ష్మి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి అన్నారు. మండలంలోని కిష్టుపురం ఆశా కార్యకర్త కృష్ణవేణిపై దాడికి పాల్పడిన టిడిపి కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్, డిఎస్‌పి కార్యాలయాల వద్ద ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆశా కార్యకర్తలు బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ స్కీమ్‌వర్కర్లపై రాజకీయ వేధింపులు పెరిగాయన్నారు. గ్రామస్థాయిలో ఆశావర్కర్ ప్రాథమిక వైద్యం మాత్రమే చేయగలరని చెప్పారు. మెరుగైన వైద్యం చేయలేదని దాడి చేయడం దుర్మార్గమన్నారు. దీనిపై ఎమ్మెల్యే గౌతు శిరీష దృష్టికి తీసుకెళ్లినా సరిగ్గా స్పందించలేదన్నారు. ఆశాపై దాడి చేసిన మామిడి మోహనరావు, మామిడి కృష్ణారావు, ప్రవీణ్, తులసమ్మపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. తొలుత పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆశా కార్యకర్త కృష్ణవేణిని యూనియన్ నాయకులు పరామర్శించారు. యూనియన్ అండగా ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. ధర్నాలో యూనియన్ నాయకులు ఎం.లావణ్య, ఐ.యజ్ఞ, ఎస్.శ్రీలత, పి.మీనా, సబితా తదితరులు పాల్గొన్నారు.

డిటి లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

## ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, క్లినిక్‌లు, లేబొరేటరీలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయకుండా వీటిని నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2002 ప్రకారం ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేసన్, రెన్యువల్ లేని వాటిని https://clinicalesttact.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పిసిపిఎన్‌డిటి యాక్టు 1994, రూల్స్ 1996 ప్రకారం స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం https://pepndt.ap.gov.inలో నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు.

## తనిఖీలతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి
- అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

ప్రజాశక్తి - రణస్థలం

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఇతర విభాగాల సమన్వయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని జె.ఆర్ పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతర్ జిల్లా సరిహద్దు గల పైడిభీమవరం చెక్‌పోస్టును బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, గంజాయి, ఇసుక, ఇతర అక్రమ రవాణాను నియంత్రించే విధంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్నీ తనిఖీ చేయాలన్నారు. అనంతరం జె ఆర్ పురం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ముఖ్యమైన రికార్డుల నిర్వహణ, కేసుల దర్యాప్తు వివరాలపై ఆరా తీశారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలు, పాటించాల్సిన నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చూడాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించాలన్నారు. ఆయన వెంట డిఎస్‌పి వివేకానంద్, సిఐలు అవతారం, ఇమ్మాన్యుయల్ రాజు, ఎస్ఐ చిరంజీవి ఉన్నారు.

పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడ**
**యఫ్.ఏ. నెం. 91/2024**
బిట్వీన్:
**శ్రీ అశ్వని కుమార్ గుప్తా**...అప్పిల్లెంట్/కంప్లయినెంట్
అండ్
**ది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్** మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్/ఆపోజిట్ పార్టీ
**నోటీసు**
టు:
**R-3:** కెవాల్ రోడ్డు కారియర్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్, పురుషోత్తపురం, శ్రీకాకుళం-532312
**R-4: M/s. భారతి అసోసియేట్స్ అండ్ ఏజన్సీస్,** రిప్రజెంటెడ్ బై ఇట్స్ ఇన్వెస్టిగేటర్ శ్రీ వి. సత్యనారాయణమూర్తి, డోర్ నెం.22-71-30 చట్రాజు వీధి, యస్.కె.యం.యల్ గుడి దగ్గర విశాఖపట్నం-530 001.
పై అప్పిల్లెంట్/కంప్లయినెంట్ శ్రీ అశ్వని కుమార్ గుప్తా గారు మహారాజశ్రీ డిస్ట్రిక్ట్ కన్స్యూమర్ కమీషన్ -I, విశాఖపట్నంలో C.C.75/2022 ఇచ్చిన తీర్పు పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, విజయవాడలో(I.A.892/2024 passed order) ప్రకారం పైనెంబరు అప్పీలు F.A.91/2024 దాఖలు చేసియున్నారు. సదరు అప్పీలులో మీయొక్క హాజరు కొరకు **తేది.30-09-2024** వాయిదా అయివున్నది. కావున పైతెలిపిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమీషన్, అశోక్‌నగర్, విజయవాడ నందు **తేది.30-09-2024 ఉ॥గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగాగానీ లేదా మీతరుపున న్యాయవాది గారి ద్వారా గాని హాజరై మీయొక్క అభ్యంతరములు, ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేనియెడల పై అప్పీలు మీపరోక్షమందు తీర్మాణించెదరని ఇందు మూలంగా మీకు తెలియజేయడమైనది.
(By Order of the Hon'ble Commission)
**MANNE HARI BABU & A.K. KALPANA**
Advocates, Vijayawada. **Cell: 94404 32681**

**మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ వారి దివ్య సుముఖమునకు**
**OS.54/2023**
**గుంటుకు శ్రీధర్** ....వాది
**కోరాడ లక్ష్మణరావు వగైరాలు** ....ప్రతివాదులు
To,
**1. కోరాడ లక్ష్మణరావు,** S/o నీలయ్య, 45 సంవత్సరాలు, హిందూ తండ్యాం గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా
**2. కోరాడ లక్ష్మి,** W/o లక్ష్మణరావు 40 సంవత్సరాలు, -rest do-
పై నెంబర్ దావ వాది మీపైన అనగా 1,2 ప్రతివాదులపై ప్రోనోటు బాకీ రాబట్టే నిమిత్తం పైకోర్టులో ప్రోనోటు దావాను దాఖలు చేయగా సదరు దావాలో మీ హాజరు నిమిత్తం **తేదీ 20-09-2024**న పైకోర్టులో వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా నాడు మీరు గానీ, మీ వకీల్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు దావాను తీర్మానించబడును.
**డోల కిరణ్‌బాబు**
**వాది తరుపు న్యాయవాది,**
**సెల్: 9866197313**

**మహారాజశ్రీ పొందూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ వారి దివ్య సుముఖమునకు**
**IA. 250/2023 in OS.54/2023**
**గుంటుకు శ్రీధర్** ....పిటిషనర్/వాది
**కోరాడ లక్ష్మణరావు వగైరాలు** ....రెస్పాండెట్/ప్రతివాదులు
To,
**1. కోరాడ లక్ష్మణరావు,** S/o నీలయ్య, 45 సంవత్సరాలు, హిందూ తండ్యాం గ్రామం, పొందూరు మండలం, శ్రీకాకుళం జిల్లా
**2. కోరాడ లక్ష్మి,** W/o లక్ష్మణరావు 40 సంవత్సరాలు, -rest do-
పై నెంబర్ దావ పిటిషనర్-వాది మీపైన అనగా 1,2 రెస్పాండెంట్-ప్రతివాదులుపై ప్రోనోటు బాకీ రాబట్టే నిమిత్తం పై నెంబర్ దావా షెడ్యూల్ దాఖల ఆస్థిపై ఎటాచ్‌మెంట్ దావాను పైకోర్టులో దాఖలు చేయగా సదరు దావాలో మీ హాజరు నిమిత్తం **తేదీ 20-09-2024**న పైకోర్టులో వాయిదా అయి ఉన్నది. సదరు వాయిదా నాడు మీరు గానీ, మీ వకీల్ గారి ద్వారా గాని హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు దావాను తీర్మానించబడును.
**డోల కిరణ్‌బాబు**
**పిటిషనర్ తరుపు న్యాయవాది,**
**సెల్: 9866197313**

**IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD**
**O.P.No. 31 OF 2024**
**Between:**
**P. Apisu and Others** ...Petitioners
**AND**
**Nirakar Pradhan and Others** ...Respondents
To,
**R-2: Mrs. Ch. Vani, W/o. Chowdari Nagaraju,** Aged: Major, Occ: Business, R/o. H.No. 14-98, Antharaba Road, Pathapatnam, Srikakulam-532213
**NOTICE**
Please take notice that the above Petitioners have filed the above O.P. for compensation against you and Respondents No. 1 & 3. Several times notices was issued to you through court and R.P. but you have failed to receive the same. The case is posted on the day of **10-10-2024** for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.
**( BY THE ORDER OF THE COURT )**
Sd/- **L.R.PRAKASH, C.D.ARUNA, H. SHARON,** Advocates, H.No. 10-308/A/2, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad. Cell: 9866611022

## శిరీష విరాళం అందజేత

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

విజయవాడలో వరదలు మిగిల్చిన నష్టాల నుంచి తేరుకుని, అక్కడ సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు ముఖ్య మంత్రి సహాయనిధికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల విరాళాలు అందజేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక నెల జీతం విరాళంగా ఇటీవల ప్రకటించారు. విజయవాడలోని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి రూ.3.05 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. అలాగే పలాసలోని ఎస్ఎస్ఎస్ ఇంటర్నేషనల్ అనే జీడి పరిశ్రమ, పీవీ కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్ ఒక్కో చెక్కును అందజేశారు. పలాస కాష్యూ ల్యాండ్ లయన్స్ వెల్ఫేర్ సొసైటీ రూ. 70 వేలు అందించగా, యెరుకోల సత్యారావు అనే వ్యాపారి రూ. 25 వేలు సిఎం సహాయనిధికి అందజేశారు. ఇదిలా ఉండగా, ఎనిమిదో తరగతి చదువుతున్న కె.రుచిత అనే చిన్నారి తోటివారిని ఆదుకోవాలనే తపనతో రూ.10 వేలు అందించినట్టు మంత్రి లోకేష్‌కు ఎమ్మెల్యే వివరించారు.

**మెప్మా ఎమ్‌డిని కలిసిన ఎమ్మెల్యే**

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష పేర్కొన్నారు. విజయవాడలోని మెప్మా ఎండి తేజ్‌భరత్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పలాస నియోజకవర్గానికి సంబంధించి స్వయం సహాయక సంఘాల పనితీరును వివరించారు. అలాగే ఆర్‌పిల జీతభత్యాలు అంశాన్ని ప్రస్తావిస్తూ, అందులోని సాంకేతిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలో ఎక్కువగా ఉద్దాన ప్రాంతం ఉందని, ఇక్కడ లభించే ముడిసరుకుతో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ద్వారా సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అందుకనుగుణంగా అదనపు రుణ సదుపాయాన్ని కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులు

## కరాటేలో మెరిసిన సిక్కోలు విద్యార్థులు

**శ్రీకాకుళం అర్బన్ :** మార్షల్ ఆర్ట్స్ సంపూర్ణ ఆరోగ్యం, ఆత్మరక్షణకు దోహదపడుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించి ఉన్నత స్థానంలో నిలవాలని శ్రీకాకుళం కరాటే చీఫ్ రెడ్డి ఢిల్లేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం శ్రీచైతన్య స్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని మహాలక్ష్మి నగర్ కాలనీలో కెన్యూ రియో కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకాలతో మెరిశారన్నారు. స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్, కెంకో షోటోకన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఆధ్వర్యాన విశాఖలో పోటీలు జరిగాయన్నారు. పోటీలకు హాజరైన కెన్యూ రియో విద్యార్థులు కటా, కుమితేలో పతకాలను కైవశం చేసుకున్నారన్నారు. ఈ పోటీల్లో 13 మంది విద్యార్థులు పాల్గొనగా 8 మందికి స్వర్ణం, ఆరుగురికి రజతం, 8 మంది కాంస్యం పతకాలు సాధించారని, గెలుపొందిన విద్యార్థులకు స్టేట్ చీఫ్ కె.సుమన్ ప్రశంసాపత్రాలను అందజేసినట్టు తెలిపారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

**కోటబొమ్మాళి:** స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ ఉపాధ్యాయ పోస్టుకు అర్హత కలిగిన నిరుద్యోగులు ఈనెల 19లోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ టి.సంతోషి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఎంకాంలో 60 శాతం ఉత్తీర్ణత సాధించినవారు, పిజి, డిగ్రీ, ఇంటర్, పదో తరగతి, తరగతి, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌ఫొటోలు కళాశాలకు అందజేయాలన్నారు. ఈ ఎంపికకు ఈ నెల21న డివిఇఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.

# పెట్టుబడి సాయం అందించాలి

టెక్కలి రూరల్ : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రైతాంగానికి పెట్టుబడి సాయంగా ప్రభుత్వం ఇస్తామన్న రూ.20 వేలు తక్షణం చెల్లించాలని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, బ్యాంకు ఋణాలు ఇప్పించాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని లింగాలవలస కాట్రగడ రిజర్వాయరును నిర్మించాలన్నారు. అనంతరం తహశీల్దార్ దిలీప్‌చక్రవర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు బగాది వాసుదేవరావు, బొడ్డిపల్లి మల్లయ్య, కొల్లి రామారావు, ఇప్పిలి మల్లేశ్వరరావు, చింతల తలాబి, సంపతిరావు, ఉమాపతి, బొడ్డు సంజీవు, చింతాడ తేజ, పి.రాఘవయ్య, కిల్లాన ఇషాఖ, సుబ్రమణ్యం, హెచ్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

జి.సిగడాం : ధర్నా చేస్తున్న కౌలు రైతులు

**వజ్రపుకొత్తూరు :** రైతు భరోసాను తక్షణమే జమ చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు టి.భాస్కరరావు, కె.బాలాజీ, బి.రామకృష్ణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి అనంతరం తహశీల్దార్ పి.బాలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు, తుపాన్లకు నష్టపోయిన పంటలకు బీమా పరిహారం చెల్లించాలన్నారు. అలాగే రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేయాలన్నారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. యజమాని సంతకం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో టి.లక్ష్మి, బి.సుగుణావతి, బి.లక్ష్మి, ఎస్.చంద్రయ్య, ఆర్.నీలాచలం పాల్గొన్నారు.

**పలాస :** పెట్టుబడి సాయం తక్షణమే అందజేయాలని ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం డిటి లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. జీడి పంటకు మద్దతుల ప్రకటించి జిఒ విడుదల చేయాలన్నారు. తిత్లీ తుపానులో నష్టపోయిన జీడి, కొబ్బరి 700 రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు.

వజ్రపుకొత్తూరు : వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వ్యవసాయం మోటార్లకు మీటర్లు జిఒ నంబరు 22ను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు ఎంపల్ల కామేశ్వరరావు, కోడ రాజారావు, గారా రుద్రయ్య, జుత్తు కిషోర్, జుత్తు నాగేశ్వరావు, మేడ్సి పాపారావు పాల్గొన్నారు.

**జి.సిగడాం:** కౌలు రైతుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం కౌలు రైతుల సంఘం నాయకుడు వెలమల రమణ అధ్యక్షత ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ ఎం.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టి.మోహన్‌రంగ, టి.సింహాచలం, రాముడు, లక్ష్మణరావు, ఎం.అసిరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

పలాస : వినతిపత్రం అందజేస్తున్న అజయ్‌కుమార్

# ఏచూరి మృతి తీరని లోటు

ప్రజాశక్తి- పొందూరు

శ్రామికవర్గ హక్కుల కోసం పోరాడిన సీతారాం ఏచూరి మరణం లౌకిక, దేశ ప్రజానీకానికి తీరనిలోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. బుధవారం మార్కెట్ యార్డులో సిఐటియు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించి మాట్లాడుతూ ఏచూరి కార్మిక, కర్షక పోరాటాల మార్గదర్శని, సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని యుద్ధం చేసిన పోరాట యోధుడని కొనియాడారు. సీతారాం ఏచూరి నుంచి ఎంతో నేర్చుకోవాలని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన ఆశయాల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు ఆర్.చంద్రమౌళి, ఎస్.రమణమ్మ, కృష్ణవేణి, రమ, లక్ష్మి పాల్గొన్నారు.

పొందూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిఐటియు నాయకులు

**వజ్రపుకొత్తూరు:** సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి శ్రామిక వర్గానికి తీరని లోటని మండల కన్వీనర్ ఎస్.మోహనరావు అన్నారు. మండలంలోని నగరంపల్లి ఏచూరి సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుపిఎ-1 పాలనలో శ్రామిక జనావళికి ఉపయోగపడుతున్న ఉపాధి హామీ చట్టం, అటవి హక్కులు చట్టం అనేక విషయాలు కమాన్ మినిమం ప్రోగ్రాం పొందుపరచి దాని అమలుకు కృషి చేశారని అన్నారు. విద్యార్థి ఉద్యమంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో బి.రామకృష్ణ, బి.కామయ్య, బి.సుగుణావతి, ఎన్.ఈశ్వరమ్మ, టి.లక్ష్మి, బి.లక్ష్మి, డి.భాస్కరరావు నాయుడు, ఎస్.ఆదినారాయణ, బి.క్రాంతికుమార్, టి.సుధాకర్, ఎస్.మల్లేషు, ఎన్.ధనలక్ష్మి, యశోదమ్మ పాల్గొన్నారు.

**కంచిలి :** మండలంలోని బూరగాంలో సీతారాం ఏచూరి సంతాప సభ సిపిఎం నాయకులు కప్ప గోపీనాథ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తారకేశ్వరావు మాట్లాడుతూ దేశం ఒక మంచి అభ్యుదయ నాయకుడిని కోల్పోయిందన్నారు. ప్రస్తుత మతతత్వ రాజకీయాలకు, ఆర్థిక సంస్కరణలకు ఒక వ్యతిరేకంగా గట్టిగా పార్లమెంట్‌లోను, ప్రాజ క్షేత్రంలోనూ మాట్లాడే మేధావి ఏచూరి అని అన్నారు. సమావేశంలో అంగన్వాడీ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

**సోంపేట :** మండలంలోని మామిడిపల్లిలో సీతారాం ఏచూరి సంస్మరణ సభలో సిపిఎం నాయకులు మద్రి లోకనాథం మాస్టారు, జి.శివరామకృష్ణ, జి.మన్మథరావు, టి.పాపారావు, పి.ముకుందరావు, ఎం.కోటేసు, ఎం.రామారావు, రైతులు టి.భీమారావు, చిట్టయ్య, చిన్నబాబు, ఎస్.హరికృష్ణ పాల్గొన్నారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

కంచిలి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

సోంపేట : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

## వ్యక్తి ఆత్మహత్య

సోమేశ్వరరావు (ఫైల్)

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పల్లిసారథికి చెందిన పోతనపల్లి సోమేశ్వరరావు (39) కలుపు మందు సేవించి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు సోమేశ్వరరావు ఈ నెల 11న పొలంలో కలుపు నివారణకు వినియోగించే కలుపు మందు సేవించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి 2020లో వివాహం జరిగింది. మద్యం సేవించే అలవాటు ఉండడంతో తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి భార్య విడిచి పెట్టి వెళ్లిపోయింది. కొద్దిరోజుల క్రితం పెద్దల సమక్షంలో విడాకుల ఒప్పందం కూడా జరిగింది. అప్పటి నుంచి పూర్తిగా మద్యానికి బానిసై మనోవేదన చెంది కలుపుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు.

## మద్యంతో వ్యక్తి అరెస్టు

**లావేరు :** మండలం వెంకటాపురం కూడలిలో బుధవారం మధ్యాహ్నం 160 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేశారు. ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లా కరకాం గ్రామానికి చెందిన గంగ్రేటి సంతోష్ ఒక మూటలో మద్యం సీసాలు వేసి తరలిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని కేసునమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు తెలిపారు. అనంతరం కోర్టు రిమాండ్‌కు ఆదేశించడంతో జైలుకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## గుండెపోటుతో చక్రధరరావు మృతి

చక్రధరరావు (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని చక్రధర్ విద్యాసంస్థల అధినేత యాళ్ల చక్రధరరావు (54) బుధవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. నరసన్నపేట మండలం మడపాం ఆయన స్వస్థలం. ఉన్నత విద్య చదువుకున్న ఆయన పలు విద్యాసంస్థల్లో అధ్యాపకునిగా పని చేశారు. అనంతరం సొంతంగా ఆయన చక్రధర్ ఐఐటి, నీట్, నిట్ ఫౌండేషన్ కోర్సుల పేరుతో ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహించేందుకు కళాశాలలను నెలకొల్పారు. ఈ కళాశాలల ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి తోడ్పాటు అందించారు. నగరంలోని సప్తగిరి ఫంక్షన్ హాల్ సమీపాన ఆయన స్వగృహంలో ఉంటూ నిద్రిస్తున్న సమయంలో గుండెపోటు రావడంతో పడక గదిలోనే మృతి చెందారు. ఆయన భార్య రమాదేవి ఆర్‌టిసిలో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తమ్ముడు రాజశేఖర్ ఆయనతో పాటే విద్యాసంస్థలను పర్యవేక్షిస్తున్నారు. కుమార్తె అకిలా నాయుడు, అల్లుడు దాసుతో కలిసి కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పని చేస్తున్నారు. తల్లి దండ్రులు చిన్నమ్మడు, మల్లేశ్వరరావు వ్యవసాయం చేసుకుంటూ స్వస్థలం మడపాంలోనే ఉంటున్నారు. ఆయన అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం జరగనున్నాయి. చక్రధర్ విద్యాసంస్థల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న కళాశాలలకు రెండు రోజులు సెలవు దినాలను యాజమాన్యం ప్రకటించింది.

స్థల పరిశీలన చేస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

## పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన

**పలాస:** మండలంలోని గరుడఖండి, పాత జగదేవపురంలో ప్రైవేటు వ్యక్తులు పెట్రోల్ బంకుల ఏర్పాటుకు దరఖాస్తు చేయడంతో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ స్థల పరిశీలన చేశారు. ఆయా ప్రాంతాల్లో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం ద్వారా ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్‌డిఒ భరత్ నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి శాంతిశ్రీ, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ నిరంజన్, ఆర్‌అండ్‌బి ఎఇ విక్రమ్ తదితరులున్నారు.

## రైళ్ల నిలుపుదల సాధన కమిటీ కన్వీనర్‌గా శ్రీనివాసరావు

**సోంపేట :** మండలంలోని బారువ రైల్వేస్టేషన్‌లో రైళ్ల నిలుపుదల కోసం పరిసర గ్రామస్తులంతా కలిసి సాధన కమిటీగా ఏర్పడ్డారు. ఈ కమిటీకి కొర్లం గ్రామానికి చెందిన రత్నాల శ్రీనివాసరావును కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారువ రైల్వే స్టేషన్ అభివృద్ధితో పాటు స్టేషన్లో రైళ్ల నిలుపుదలకు తన వంతు కృషి చేస్తానన్నారు.

**22న సమావేశం**

బారువ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు ఈ నెల 22న రైల్వే నిలుపుదల సాధన కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని కన్వీనర్ శ్రీనివాసరావు తెలిపారు. కొర్లం బాలకృష్ణ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నామని అన్నారు. యువకులు, పెద్దలు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైల్వే స్టేషన్ అభివృద్ధితో పాటు పాసిజర్లు, ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేసేందుకు కమిటీ ఆధ్వర్యాన కృషి చేస్తామన్నారు.

## రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

**ఆమదాలవలస :** పట్టణంలోని పార్వతీశంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కెవి బొడ్డేపల్లిపేట ఫీడర్ పరిధిలో ఈ నెల 21న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎలక్ట్రికల్ ఇఇ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా ఈ అంతరాయం కలుగనున్నట్లు తెలిపారు. పట్టణ పరిధిలోని బొడ్డేపల్లిపేట, పూజారిపేట, ఐ.జె.నాయుడు కాలనీ, మోణింగి వారి వీధి, డాబాలవారివీధి, కొత్తకోట వారి వీధి, పోలీస్ స్టేషన్, పాలపోలమ్మ గుడి, కామేశ్వరి కల్యాణ మండపం తదితర ప్రాంతాలకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

# సిఎం సమావేశంలో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి- పాతపట్నం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో బుధవారం ఎన్‌డిఎ ఎల్‌పి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్, కూన రవికుమార్, మామిడి గోవిందరావు, గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్‌లు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యే అందరూ పక్కపక్కనే కూర్చున్నారు. రాష్ట్ర ప్రజలు మెచ్చేలా మన పాలన ఉంటే ఎవరు ఏమి చేయలేరని, ప్రతి నియోజకవర్గంలో నియోజకవర్గ ఎమ్మెల్యేలు చేసిన పనులు, చేయబోయే పనులను ప్రజలకు వద్దకు వెళ్లి వివరించాలని సూచించారు.

పాల్గొన్న జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు

**ఎమ్మెల్యే ఎన్ఇఆర్ పనితీరుపై సిఎం అభినందన**

చంద్రబాబు, పవన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

**రణస్థలం రూరల్:** అమరావతిలో జరిగిన ఎన్‌డిఎ ఎల్‌పి సమావేశంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తుఫాన్ కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల వలన రహదారులన్ని దెబ్బతిని ప్రజలు ఇక్కట్లు పాలవుతున్నారనే అంశాన్ని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధ్యాయుల సర్దుబాటు జిఒ 117 రద్దును పరిశీలించాలని, ఉపాధ్యాయ సంఘాలు తమ అసంతృప్తి వ్యక్తం చేస్తున్న అంశాన్ని విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ విషయంపై నియోజకవర్గానికి వస్తానని లోకేష్ చెప్పినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

## 'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ద్వితీయ ఏడాది సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వారం రోజుల పాటు ఎపిఎస్ఎస్‌డిసి సిమెన్స్ ఎక్సెలెన్స్ సెంటర్ ద్వారా 'బిల్డింగ్ డ్రాఫ్టింగ్ యూజింగ్ ఆటో కేడ్' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో విద్యార్థులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. అండర్స్టాండింగ్ ది ఆటోకేడ్ వర్క్ స్పేస్ అండ్ యూజర్ ఇంటర్ఫేస్, యూజింగ్ బేసిక్ డ్రాయింగ్, ఎడిటింగ్, అండ్ వ్యూయింగ్ టూల్స్, ఆర్గనైజింగ్ డ్రాయింగ్ ఆబ్జెక్ట్స్ ఆన్ లేయర్స్, ఇన్సర్టింగ్ రీయూజబుల్ సింబల్స్, ప్రిపేరింగ్ ఎ లేఔట్ టు బి ప్లాటెడ్ వంటి అంశాల్లో ఎపిఎస్ఎస్‌డిసి ట్రైనర్ దాలినాయు శిక్షణిచ్చారన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎపిఎస్ఎస్ డిసి-స్పాక్ డాక్టర్ బి.రామారావు, సివిల్ హెచ్‌డి డాక్టర్ పి.దినకర్, డిపార్ట్‌మెంట్ కో-ఆర్డినేటర్ ఎం.సాయిబాబు పర్యవేక్షించారన్నారు.

# నగరంలో స్వచ్ఛతా ర్యాలీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ ఆధ్వర్యాన ప్రజల్లో స్వచ్ఛతపై అవగహన కల్పించడానికి వినూత్న రీతిలో ప్రదర్శన చేపట్టారు. బుధవారం చేపట్టిన ఈ ర్యాలీలో నగరంలో ఉన్న వ్యాపారులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వచ్ఛత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛత హీ సేవ 2024లో భాగంగా చేపట్టిన ఈ ర్యాలీ నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి మొదలైంది. మున్సిపల్ మెల్తాపీసరు డాక్టర్ సుధీర్‌కుమార్ ర్యాలీని ప్రారంభించారు. ఏడురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టి అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది, మెప్మా, ఆశావర్కర్లు, లైన్స్‌క్లబ్, రోటరీక్లబ్, ఇతర ఎన్‌జిఒలు తదితరులు పాల్గొన్నారు.


మానవహారం నిర్వహిస్తున్న వ్యాపారులు, అధికారులు

# 'ఉపాధి' అక్రమాలపై నిలదీత

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో 2023 - 24లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో అక్రమాలపై నిర్వహించిన ప్రజావేదికలో పలువురు అధికారులను నిలదీశారు. మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఇటీవల సామాజిక తనిఖీ బృందాలు ఆయా గ్రామ పంచాయతీల్లో నిధుల చెల్లింపులపై తనిఖీ నిర్వహించారు. గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభల అనంతరం బుధవారం ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయ ఆవరణలో మండలస్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజా వేదికలో పంచాయతీల వారీగా సామాజిక తనిఖీ బృందం నమోదు చేసిన వివరాలను చదివి వినిపిస్తున్న సమయంలో వంజంగి గ్రామపంచాయతీలో నిర్వహించిన ఉపాదిహామీ పనుల్లో కొన్ని అవకతవకలు జరిగాయని మాజీ సర్పంచ్ ఎండ అప్పలనాయుడు ఎపిడి లోకేశ్వరరావు, జిల్లా అధికారి స్వరూప రాణి, విజిలెన్స్ అధికారి లవరాజు దృష్టికి తీసుకు వెళ్లారు. అలాగే మండలంలోని గాజుల కొల్లివలస పంచాయతీలో దేశెట్టి బాల గోపి అనే వ్యక్తి జొన్నవలస 30 పడకల ఆస్పత్రిలో పగలు, రాత్రి సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తుంటే ఆ వ్యక్తికి 100 రోజుల ఉపాధి హామీ మస్టర్లు ఎలా వేశారని, 250 మొక్కలు నాటినట్టు చూపిన ఫీల్డు అసిస్టెంట్ ప్రస్తుతం 19 మొక్కలే ఉన్నాయని తనిఖీ బృందం చెప్పడంలో ఆంతర్యం ఏమిటని, అలాగే చాలా మందికి తప్పుడు మస్టర్లు వేసి అక్రమాలకు ఫీల్డు అసిస్టెంట్ పాల్పడ్డాడని టిడిపి నాయకుడు చిన్నారావు ఆధ్వర్యంలో యువత గ్రామసభలో అధికారులను ప్రశ్నించారు.

అధికారులను ప్రశ్నిస్తున్న గాజుల కొల్లివలస యువకులు

నెల్లిపర్తి గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాదిహామీ పనుల్లో పూర్తిస్థాయి అక్రమాలు జరిగాయని కుమార్, 50 మంది గ్రామసభలో ప్రశ్నించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో ఫీల్డు అసిస్టెంట్ గ్రామసభకు, ప్రజావేదికకు గైర్హాజరవ్వడంతోనే ఆయన పనితీరు అర్థమైందని ఆయనపై రికవరీతో పాటు చర్యలు తీసుకుంటామని ముందుగానే అధికారులు చెప్పడంతో నెల్లిపర్తి గ్రామస్తులు శాంతించారు. కలివరం పంచాయతీలో 95 ఏళ్ల తంగి రాజారావు మంచం మీద ఉన్న వ్యక్తికి ఫీల్డు అసిస్టెంట్ మస్టర్లు వేయడం గుర్తించినట్లు సామాజిక తనిఖీ బృందం ప్రజావేదికలో చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, టిడిపి నాయకులు నూకరాజు, సనపల ఢిల్లీశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, ఎపిఒ లక్ష్మీనరసమ్మ, ఎస్ఆర్‌పి పున్నపునాయుడు, ఇఒపిఆర్‌డి డి.గోవిందరావు పాల్గొన్నారు.

## సామూహిక సీమంతాలు

**ఇచ్ఛాపురం:** పట్టణంలోని 22 వార్డు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహికంగా బుదవారం సీమంతాలు చేశారు. అనంతరం కౌన్సిలర్ కాళ్ల దిలీప్‌కుమార్ పౌష్టికాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆహార పదార్థాలు, చిరుధాన్యాలు ఆకుకూరలు, బాలామృతం ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు సురేఖ, కోమలి, పాతిమ, ఆర్‌పి రమణమ్మ, ఆశ కార్యకర్త ఇందిర పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

## మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

**పలాస :** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డు కొండివీధిలో రూ.5 లక్షల వ్యయంతో సిసి రోడ్డు, కాలువ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో దశల వారిగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డులకు సమాన ప్రాతిపదికన నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో మున్సివల్ మేనేజర్ పూడి రవిబాబు, వార్డు కౌన్సిలర్ సప్ప అమ్మోజీ, కౌన్సిలర్ సవర సోమేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, సప్ప నవీన్ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న గిరిబాబు

# మందుల నిర్వహణ ఇలాగేనా..?

## పిహెచ్‌సిలో చిందరవందరగా మందులు

ప్రజాశక్తి- పొందూరు

మన చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తాచెదారాలు ఎక్కడపడితే అక్కడ వేయరాదని, అపారిశుధ్యం పారదోలి పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలు దరిచేరవంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తుంటాం. అయితే ఈ అవగాహన ప్రజలకే గాని వాటిని తాడివలస పిహెచ్‌సి సిబ్బంది మాత్రం ఆచరించడం లేదు. తాడివలస పిహెచ్‌సిలో అడుగుపెడితే చాలు ఎక్కడ చూసినా చిందరవందరగా పడిఉన్న మందులే దర్శనమిస్తాయి. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం సరఫరా చేసే మందుల నిర్వాహణలో ఆస్పత్రి సిబ్బంది ఇంత నిర్లక్ష్యమా అంటూ ప్రజలు మండిపడుతున్నారు. ఆస్పత్రిలో ఏ గదికి వెళ్లినా నిండుగా మందులు ఉండి చిందరవందరగా పడి ఉంటున్నాయి. గదుల్లో కూడా చెత్తా చెదారాలతో అపారిశుధ్యం నెలకొంది. ఇంజక్షన్లు వేసే సమయంలో రక్తం కారకుండా రోగులకు ఇచ్చే దూది చెత్తడబ్బాలో వేయాల్సి ఉండగా ఎక్కడ పడితే అక్కడే చెల్లా చెదురుగా పడి ఉంది. రోగాలు నయం చేసుకునేందుకు ఆస్పత్రికి వచ్చేవారికి తిరిగి రోగాలు అంటుకునేలా ఉందని పలువురు పేర్కొంటున్నారు. స్టోర్‌రూముల్లో భద్రంగా ఉంచాల్సిన మందులను పిహెచ్‌సిలో పలు గదుల్లో చెల్లాచెదురుగా ఎక్కడపడితే అక్కడ పడివేస్తున్న మందులపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.

స్టోర్‌రూమ్‌లో చెల్లాచెదురుగా పడి ఉన్న మందులు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి- పలాస**

ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా విద్యా సంస్థలు నడిపిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌టిఒ వై.శ్రీనివాసరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరిపురంలోని కైజన్ స్కూల్ ఎటువంటి రిజిస్ట్రేషన్ లేకుండా కనీసం అర్హత లేని టీచర్లను నియమించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. విచ్చలవిడిగా వేలాది రూపాయలు వివిధ కోర్స్ పేర్లు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి వసూలు చేస్తున్నారని విమర్శించారు. ద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడడం లేదన్నారు. ఫిట్నెస్ ధ్రువపత్రాలు లేకుండా బస్సులను నడుపుతూ పరిమితం మించి విద్యార్థులని తరలిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు పవన్, జస్వంత్, మణి పాల్గొన్నారు.

విచారణ చేస్తున్న ఎంఇఒ జోరాడు

## గుడ్లు బాగానే ఉన్నాయి

**ప్రజాశక్తి- సోంపేట**

సోంపేట బాలిక ఉన్నత పాఠశాలలో కుళ్లిన గుడ్లను విద్యార్థులకు వడ్డిస్తున్నారన్న దానిలో వాస్తవం లేదని హెచ్ఎం దామోదరరావు తెలిపినట్లు ఎంఇఒ జోరాడు తెలిపారు. పాడైన ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారంటూ విద్యార్థులు మంగళవారం పాఠశాల తనిఖీకి వచ్చిన అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై ఎంఇఒ పాఠశాల ఆవరణలో బుధవారం విచారణ చేపట్టారు. విచారణ అనంతరం మాట్లాడుతూ హెచ్ఎం తమదేమి తప్పులేదు అనట్లు వివరణ ఇచ్చారని తెలిపారు. దీనిపై స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు.

# క్రీడలతోనే మానసికోల్లాసం

పలాస : ప్రారంభిస్తున్న విఠల్‌రావు

**ప్రజాశక్తి- పలాస**

క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు అన్నారు. మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మండల స్థాయి అండర్ 14, 17 బాలబాలికల కబడ్డీ, వాలీబాల్ జట్లు ఎంపిక కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించే సౌకర్యం అందని అన్నారు. దీనిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షులు కిక్కర ఢిల్లీరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జి.తులసిరావు, హెచ్ఎంలు వీర్రాజు, విడివిఇటి అసోసి యేషన్ అధ్యక్షులు తవిటయ్య. విఇటి రాంజీ, వద్మలోచన, పాల్గొన్నారు.

**మెళియాపుట్టి:** మండలంలోని పెద్దమడి బాలుర పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, గ్రిక్స్ సెలక్షన్ కం టోర్నమెంట్ ఆటల పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఎంఇఒలు దేవేందరరావు, మల్లారెడ్డి పద్మనాభం ఆధ్వర్యాన వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, క్విట్ పోటీలు నిర్వహించనున్నారు. ఇక్కడ గెలుపొందిన విజేతలను నియోజవర్గ స్థాయిలో జరగనున్న క్రీడా పోటీలకు పంపనున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజిత్ కుమార్, బాలురు, బాలికల ప్రిన్సిపాల్ విన్నారావు, మండల స్పోర్ట్స్ అడ్వైయిజర్ గోవిందరావు, పీడీలు, పిఇటిలు పాల్గొన్నారు.

**జి.సిగడాం :** మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రారంభించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండలస్థాయి గ్రిక్స్ పోటీలు బుధవారం నుంచి ప్రారంభించారు. ఈ పోటీలకు అండర్ 14, అండర్-17 బాల బాలికల క్రీడా పోటీలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కుమారపు రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మెళియాపుట్టి : వాలీబాల్‌ను ప్రారంభిస్తున్న ఎంఇఒ

జి.సిగడాం : ఆటలు ఆడుతున్న విద్యార్థులు

ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులకు ఆటలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల వెంకట రమణ, జెడ్‌పిటిసి కాయల రమణ, ఎంఇఒలు ఆరసాడ రవి, ఎం.శ్రీనివాసరావు, హెచ్ఎం, సిబ్బంది, మండల నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

**పొందూరు:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి గ్రిక్స్ పోటీలను ఎంఇఒలు పి.వి.రామరాజు, పి.రాజారావులు ప్రారంభించారు. మండలంలోని 10 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారు. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటైన్, టెన్నీకాయిట్ పోటీలు నిర్వహించనున్నారు. అనంతరం ఈ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు నియోకవర్గస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.వెంకటరావు, టిడిపి నాయకులు కె.శ్రీనివాసరావు, కె.శాంతారాం, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన పాఠశాలల సముదాయాలు

సంతబొమ్మాళి : మాట్లాడుతున్న రామకృష్ణ

**ప్రజాశక్తి- టెక్కలి**

ఉపాధ్యాయులు బోధనలో మెళకువలను నేర్పిస్తూ... శిక్షణకు వినియోగిస్తున్న పాఠశాలల సముదాయాలను వినియోగించుకోవాలని ఎంఇఒలు దల్లి తులసిరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు సూచించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న పాఠశాలల సముదాయాలు బుధవారంతో ముగిశాయి. మండలంలోని నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ, సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఇంగ్లీష్, బాలికోన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం సబ్జక్టుల పాఠశాలల సముదాయం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సముదాయాల్లో చర్చించుకున్న అంశాలను అవగాహన చేసుకుని తరగతి గదిలో వినియోగించాలన్నారు. ఆయా సముదాయాల చైర్మన్లు సోమేశ్వరరావు, సత్తారు వేణీకుమారి, శోభారాణి, నాగభూషణం పాల్గొన్నారు.

**సంతబొమ్మాళి :** సంతబొమ్మాళి, కోటబొమ్మాలి మండలాలకు చెందిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుల పాఠశాల సముదాయ సమావేశం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బోరుభద్రలో సముదాయ కార్యదర్శి బాడాన రాజు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సముదాయ చైర్మన్ పి.రామకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విజ్ఞానాన్ని పంచుకునే అద్భుత వేదిక పాఠశాల సముదాయ సమావేశాలని అన్నారు. పాఠశాల సముదాయ కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ సామాజిక స్పృహ, నైతిక విలువలను జోడించి పాఠాలతో పాటు జీవిత పాఠాలు బోధించి విద్యార్థుల మనసులను గెలుచుకొనే ఛాంపియన్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడని అన్నారు. ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారా ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రతి ఉపాధ్యాయుడూ కృషి చేయాలన్నారు. వినూత్న బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు కె.తవిటిరెడ్డి, విష్ణు, చందనరావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఉపాధ్యాయులు కె.తవిటిరెడ్డి, టి. చందన రావు, ఆట్ల విష్ణు, కె.లక్ష్మీ నారాయణ, సామ సంజీవ రావు, బి.పాపారావు, జనార్ధనరావు, తిరుమలరావు, మీనా, శివజ్యోతి, అరుణ కుమారి పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు హానికరం

**ఇచ్ఛాపురం :** మత్తు పదార్థాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని సిడిపిఒ నాగరాణి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల బాలికలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాలను వినియోగించరాదన్నారు. వినియోగించిన వ్యక్తులను గుర్తించిన వెంటనే తక్షణమే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలను వివరిసూ... విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తను తొలగిస్తున్న మహిళలు

## మహిళల ర్యాలీ

**కొత్తూరు :** మండలంలోని కర్లెమ్మ పంచాయితీ నేతాజీ నగర్ కాలనీలో వెలుగు ఆధ్వర్యాన మహిళలు బుధవారం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఎక్కడిపడితే అక్కడ చెత్త వేయరాదని, తాగునీరు వృథా చేయరాదంటూ నినాదాలు చేశారు. ప్రతి మహిళా సంఘ సభ్యులూ మొక్కలు నాటాలన్నారు. భవిష్యత్‌లో గాలి, నీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సిసిలు అరుణ్‌జ్యోతి, కనక మహాలక్ష్మి, చంద్రరావు, వివఒలు సంఘం అధ్యక్షులు సింహాద్రి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఐ సుధాకర్

## మైనర్లు వాహనాలు నడపడం నేరం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

మైనర్లు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ అన్నారు. బుధవారం రెల్లవీధి సమీపంలో సాయికృష్ణ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, చట్టాలపై అవగహన పెంచుకోవాలన్నారు. జిల్లా ఎస్‌పి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, ట్రిపుల్ రైడింగ్ వెళ్లడం ప్రమాద కరమన్నారు. లైసెన్సు పొంది, మోటార్ బైక్ నడిపే ప్రతిఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

ఆర్థికసాయాన్ని అందజేస్తున్న సమితి సభ్యులు

## రోడ్డు ప్రమాద బాధితునికి సాయం

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

మండలం సింగుపురానికి చెందిన దాసరి వినయ్ కుమార్ ఇటీవల కోమర్తి వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై తలకు బలమైన గాయం కావడంతో నగరంలోని కిమ్స్ ఆస్పత్రి చేరాడు. వైద్య పరీక్షల అనంతరం తలకు బలమైన గాయాలుండడంతో శస్త్ర చికిత్స అవసరమని, ఈ చికిత్సకు ఆరోగ్యశ్రీ వర్తించదని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ చికిత్స కోసం సుమారు రూ.4 లక్షలుపైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో దాతల సాయం కోసం ఆయన తల్లిదండ్రులు అభ్యర్థించారు. విషయం తెలుసుకున్న సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు, మిత్రులు, దాతల సహకారంతో రూ.17 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని బుధవారం కిమ్స్ ఆస్పత్రిలో బాధితుడు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సమితిసభ్యులు పొడుగు అవినాష్, బరాటం చంద్రశేఖర్, ఉర్లం శివతేజ, కలివరపు సూర్యప్రకాష్ ఉన్నారు.

## పాఠశాలలకు కంప్యూటర్లు అందించాలి

**ప్రజాశక్తి- పొందూరు**

రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్, ప్రింటర్లను ప్రభుత్వం అందజేయాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో ఉన్న ల్యాప్‌టాప్‌లను వెనక్కి తీసుకున్నారని, దీంతో ఉన్నత పాఠశాలల్లో ఎన్ఎంఎంఎస్, ఎస్ఎస్‌సి విద్యార్థుల ఆన్‌లైన్ దరఖాస్తులు, నామినల్ రోల్స్ తదితర పనులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత మూడేళ్లుగా పాఠశాల గ్రాంట్లు విడుదల చేయకపోవడంతో సంబంధిత హెచ్ఎంలు జేబు డబ్బులు ఖర్చు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. పాఠశాల సముదాయ సమావేశాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్న అధికారులు కనీసం టీ, బిస్కెట్లుకు నిధులు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు.

## చిన్నారుల ఆర్థికసాయం

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

రాష్ట్రంలో ఇటీవల సంభవించిన వరదల నేపథ్యంలో పట్టణంలోని భవిత స్కూలు చిన్నారులు వరద బాధితులకు రూ.30 వేలు బుధవారం సేకరించారు. పాఠశాలలో ప్రతి చిన్నారి తనవంతు సాయం అందించారు. ఈ మొత్తాన్ని సిఎం సహాయ నిధికి పంపనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు, డైరెక్టర్ సువ్వారి సునీత వెల్లడించారు. పాఠశాలకు చెందిన జి.భాగ్యశ్రీ, ఆర్.పవిత్ర మెట్ట, నేహా, కావ్యశ్రీ బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో నిధులు వసూలు చేసి అందరి మన్ననలు అందుకున్నారు. విరాళాలు సేకరించిన చిన్నారులను పలువురు అభినందించారు. వీరి వసూళ్లకు ఎన్ఆర్ఐ సువ్వారి శ్రీనివాసరావు, జ్యోతిలక్ష్మి దంపతులు 101 డాలర్లు వారి వంతు సాయం అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కె.వెంకటేశ్వరరావు, లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విరాళాలు సేకరిస్తున్న చిన్నారులు

# భూసారం ఆధారంగా ఎరువుల వాడకం

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎఒ సూర్యకుమారి

**ప్రజాశక్తి- రణస్థలం రూరల్**

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని డిఆర్‌సి ఎఒ సూర్యకుమారి అన్నారు. మండలంలోని వేల్పురాయిలో వ్యవసాయ శాఖ, ఆత్మ సౌజన్యంతో గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం, ఎరువుల యాజమాన్యంపై రైతులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు వేసుకోవాలన్నారు. యూరియాను మాత్రమే కాకుండా అన్ని పోషకాలు సమతుల్యంగా అందేలా పొటాష్‌ను వాడాలన్నారు. వరిలో కేవలం పురుగులు, తెగుళ్ల ఉధృతంగా ఉంటాయని, రైతులు తెగుళ్లను గమనించి అధికారుల సూచనలతో తగిన మందులు వాడాలన్నారు. అనంతరం పెద్దింటి ఈశ్వరరావు పొలంలో వరి వెదను సందర్శించారు. కార్యక్రమంలో ఎఒ ప్రియాంక, మండల ఎఒ డి.విజయ్ భాస్కర్, ప్రశాంత్, రవితేజ, వెంకటరమణ, రైతులు వి.జె.ఎస్.ఎల్.పి.మౌళి, శ్రీనివాసరావు, శ్రీరాములనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### పంట సాగు విధానాలు మారాలి

**రణస్థలం:** కాలానుగుణంగా పంటసాగు విధానాలు మారాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. బుధవారం కోష్టలో రైతుమిత్రల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'ఇటీవల విచ్చలవిడి వనాల విధ్వంసం, కాలుష్యం, పంటల్లో పరిమితికి మించి రసాయనాల వినియోగం వంటి దుష్పరిణామాలతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని రైతే ప్రత్యక్షంగా నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో భూసార పరీక్షలు చేయించి వాతావరణ మార్పుల ప్రభావాలను కొంతవరకు అధిగమించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ పి. తవిటినాయుడు, సమన్వయకర్తలు ఎస్.పి.నారాయణరావు, పి.రమణ, రైతుమిత్రలు పాల్గొన్నారు.

# అన్న క్యాంటీన్‌లో నాణ్యత పరిశీలన

**ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్**

పేదల కడుపు నింపాలన్న లక్ష్యంతో సిఎం చంద్రబాబు అన్న క్యాంటీన్‌లను ప్రారంభించారని, ఈ సౌకర్యాన్ని ప్రతి పేదవాడు పొందాలని నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షులు గొండు స్వాతి కోరారు. బుధవారం నగరంలోని ఏడురోడ్ల కూడలి, పాత బస్టాండ్, చల్లవీధి జంక్షన్‌లో అన్న క్యాంటీన్‌లను ఆమె సందర్శించి ఆహార నాణ్యతను పరిశీలించారు. ఆమెతో పాటు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాద్, టిడిపి నాయకులు రెడ్డి గిరిజ శంకర్, తదితరులున్నారు.

ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న స్వాతి

### మున్సిపల్ కార్యాలయంలో అన్నదానం

నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాద్ హాజరై అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్తాఫీసరు డాక్టర్ సుదీర్, టిడిపి నాయకులు పాండ్రంకి శంకర్, రెడ్డి గిరిజా శంకర్ పాల్గొన్నారు.

# పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

**ప్రజాశక్తి- పలాస**

మండలంలోని రామకృష్ణాపురం సత్యసాయి విద్యా విహార్‌లో చదువుతున్న విద్యార్థులకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యాన రూ. 20 లక్షలు విలువ చేసే ఫర్నిచర్ బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ నిత్యానందరెడ్డి, అరబిందో ఫార్మా లిమిటెడ్ ఫౌండేషన్ డైరెక్టర్ పి.శరత్‌చంద్రరెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులు సత్యసాయి విద్యా సంస్థలో చదువుకుంటూ ఎంతో మంది ఉన్నత స్థానంలో ఉన్నారని చెప్పారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యా విహార్ కన్వీనర్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి పాల్గొన్నారు.

ఫర్నిచర్ పంపిణీ చేస్తున్న అరంబిందో ఫౌండేషన్ సభ్యులు

# 'పిఎం సూర్యఘర్'పై సమీక్ష

సచివాలయ సిబ్బందితో సమీక్షిస్తున్న ఎఇ రామారావు

**ప్రజాశక్తి- ఆమదాలవలస**

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై సచివాలయ వార్డు అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీ సెక్రటరీలతో పట్టణ ఎలక్ట్రికల్ ఎఇ జి.రామారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అధ్యక్షతన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలోని సోలార్ రూఫ్ టాప్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఎఇ రామారావు మాట్లాడుతూ సొంత ఇల్లు కలిగిన వారు సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోవడం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ పథకంపై సచివాలయ పరిధిలో ఉండే ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎఇ అప్పలనాయుడు, మున్సిపల్ మేనేజర్ చక్రవర్తి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా సింగూరు రోడ్డు

సింగూరు రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి- పొందూరు**

ఇటీవల కురిసిన వర్షాలకు రెల్లిగెడ్డకు వరదనీరు పోటెత్తడంతో రెల్లిగెడ్డకు ఆనుకుని ఉన్న సింగూరు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రెల్లిగెడ్డకు ఆనుకుని ఉన్న రహదారి సుమారు 8 అడుగుల మేర కృంగిపోవడంతో ఎప్పుడు ఈ రోడ్డు కూలిపోతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఈ రహదారి ద్వారా మండలంలోని గోకర్ణపల్లి, తాడివలస, లచ్చయ్యపేట, గంగ్రేడు, బొడ్డేపల్లి, మొదలవలస, సింగూరుతో పాటు ఆమదాలవలస మండలం బెలమాం, లొద్దలపేట, నెలిమెట్ల గ్రామాల ప్రజలు శ్రీకాకుళం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఈ విషయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లడంతో రహదారిని వెంటనే పరిశీలించాలని ఇరిగేషన్ అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఇరిగేషన్ డిఇఇ రమణ, ఎఇ రవి కుంగిన రహదారిని పరిశీలించారు.

# జగనన్న కాలనీ అవినీతిపై దర్యాప్తు చేయాలి

**ప్రజాశక్తి- పొందూరు**

మండలంలోని తోలాపిలో జగనన్న కాలనీలో భూసేకరణ నుంచి ఇళ్ల పట్టాల పంపిణీ వరకు జరిగిన అవినీతిపై అధికారులు దర్యాప్తు జరపాలని తోలాపి మాజీ ఎంపిటిసి పొన్నాడ అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఇళ్లు, స్థలం లేనివాళ్లకు మాత్రమే పట్టాలు మంజూరు చేయాల్సి ఉండగా, వైసిపి నాయకులు ఇళ్లు, భవంతులు ఉన్నవారితో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలకు మాత్రమే పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. ఇళ్ల పట్టాల కోసం భూమి కొనుగోలు చేయవద్దని, గ్రామంలో సర్వే నెంబర్ 101లో రెండెకరాల భూమి ఉందని ఒక వర్గం సూచించినా పట్టించుకోలేదన్నారు. కొంతమంది వైసిపి నాయకులకు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు వైసిపి కార్యకర్తల నుంచి, చెరువు గర్భంలో భూమి కొనుగోలు చేశారని, అప్పటి తహశీల్దార్ టి.రామకృష్ణ సహకరించడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగ మైందన్నారు. గ్రామానికి చెందిన వైసిపి నాయకులు 174-1 సర్వేలో కూనవాని చెరువు, ఇందిరమ్మ కాలనీకి సంబంధించిన స్థలంలో సుమారు రెండు ఎకరాలు తన భార్య పేరున పత్రాలు సృష్టించారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తానన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎంపిటిసి అప్పారావు

# గుంతల్లో దిగబడుతున్న లారీలు

### ఇబ్బందులు పడుతున్న ప్రజలు

**ప్రజాశక్తి- సరుబుజ్జిలి**

అలికాం, బత్తిలి ప్రధాన రహదారి గుంతల్లో నిత్యం లారీలు దిగబడటంతో ప్రయాణికులు, వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి పెట్రోల్ బంక్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై గుంతల్లో వాహనాలు దిగబడిపోవడం నిత్యకృతంగా మారింది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో పోలీస్ స్టేషన్ సమీపంలో ఒక ఇసుక లారీ, ఇనుప ఊసలతో వెళ్తున్న మరో లారీ ఒకే ప్రాంతంలో దిగబడిపోవడంతో రాత్రంతా రెండు లారీల సిబ్బంది జాగారం చేశారు. అలాగే అదే సమయంలో పెట్రోల్ బంక్ వద్ద ఉన్న గుంతలో మరో ఇసుక లారీ దిగబడిపోవడంతో వారు కూడా ఉదయం వరకు వేచి చూడాల్సి వచ్చింది. బుధవారం ఉదయం జెసిబిల సహాయంతో లారీలను బయటకు తీయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి. నిత్యం ఈ రహదారిపై లారీలు గోతుల్లో దిగబడడం, జెసిబిలతో తొలగించడం తమకు నిత్యకృత్యంగా మారిందని పలువురు వాపోతున్నారు. రహదారులపై ప్రయాణం కొనసాగించాలంటే ఇబ్బందికరంగా మారిందని పలువురు వాపోతున్నారు. ఇంకెంతకాలం ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందోనని, ఎప్పటికి రహదారి కష్టాలు తీరుతాయోనని పలువురు చర్చించుకుంటున్నారు.

రహదారి గుంతల్లో దిగబడిన లారీలు

# మేదరులను ఆదుకోవాలి

ర్యాలీ నిర్వహిస్తున్న మేదరులు

**ప్రజాశక్తి- ఇచ్ఛాపురం**

మేదరులను అన్ని విధాలుగా ఆదుకోవాలని మేదరి సాధికారిక సమితి రాష్ట్ర కన్వీనర్ దూల్లిపాల్ల ఏసుబాబు కోరారు. బుధవారం ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణ పుర వీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ కమ్యూనిటీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేదరి వృత్తిదారులు దయనీయమైన పరిస్థితుల్లో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెదురులకు ముడి సరుకులు దొరకడం లేదని పేర్కొన్నారు. మేదరులను ఎస్‌టి, ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరారు. కార్యక్రమలో గురూజీ భరతనంద స్వామిజీ, మహేంద్ర మేదరి సంఘం అధ్యక్షులు తెల్లి ధర్మారావు, కార్యదర్శి తెల్లి వెంకటకృష్ణ, కోశాధికారి కొయిలి కృష్ణకుమార్, అడ్వైయిజర్ కమిటీ తెల్లి బలరాం, తెల్లి వైకుంఠరావు, వై.చంద్రరరావు, కొయిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.